క్లుప్తంగా

ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి


నివాళులర్పిస్తున్న మహిళలు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని నౌగాంబస్తీ కాలనీలో వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు దుర్గం అనిత మాట్లాడుతూ భూమి, భుక్తి కోసం పోరాడిన వీర తెలంగాణ రైతాంగ పోరాటయోధురాలు చాకలి ఐలమ్మ అన్నారు. కార్యదర్శి వినోద, జయలక్ష్మి, సంధ్య, రజిత, శిరీష్, స్రవంతి, అస్రిన్, లక్ష్మి, సౌజన్య, అపర్ణ, చంద్రకళ, అక్షిత, రాజేశ్వరి మహిళలు పాల్గొన్నారు.

రైతు వేదికలో యూరియా పంపిణీ కేంద్రం ఏర్పాటు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మండలంలోని జంబుగ రైతు వేదికలో యూరియా పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పీఏసీఎస్ అధికారులు గురువారం తెలిపారు. కాగజ్‌నగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో యూరియా పంపిణీలో రైతుల రద్దీ అధికంగా ఉండడంతో వ్యవసాయాధికారులు యూరియా పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరడంతో జంబుగ రైతు వేదికలో యూరియా పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కాగజ్‌నగర్ మండలంలోని ఈజ్‌గాం, నామనగర్, వల్లకొండ, సీతానగర్, నాగంపేట్, రాస్పెల్లి, సార్సాల, నజ్రుల్‌నగర్, గన్నారం, ఆరెగూడ, మోసం, అంకోడ, కడంబ గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నానో యూరియాపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో రామకృష్ణ

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మండలంలోని ఆరెగూడ, కడంబ గ్రామాల్లో నానో యూరియాపై రైతులకు వ్యవసాయాధికారి రామకృష్ణ గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు మోతాదుకు మించి ఎరువులు వాడి భూసారాన్ని కోల్పోకుండా చూసుకోవాలని, నానో యూరియా వాడకంతో ఖర్చు తగ్గి దిగుబడి పెరుగుతుందన్నారు. రైతులు పంట మార్పిడి చేయాలని సూచించారు. పంట సాగులో సందేహాలు ఉన్నట్లయితే ఏఈవోలను సంప్రదించాలన్నారు. రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి'


ఇంటి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో అల్బర్ట్

పెంచికల్‌పేట్: ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో అల్బర్ట్ అన్నారు. గురువారం ఎల్లూర్, బొంబాయిగూడ, చేడ్వాయి, దరోగపల్లి గ్రామాల్లో ఇండ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అర్హులకు ఐకేపీ ఆధ్వర్యంలో రుణాలు అందించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఆయన వెంట హౌజింగ్ ఏఈ సందీప్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

గ్రూప్ 1 పరీక్ష మళ్లీ నిర్వహించాలని నిరసన


నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: గ్రూప్ -1 పరీక్షలు రద్దు చేసి తిరిగి పరీక్షను నిర్వహించాలని కోరుతూ బీఆర్‌ఎస్‌పార్టీ నాయకులు పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ హైకోర్టు ఈనెల 11న గ్రూప్-1 పరీక్షల ఫలితాల్లో అవకతవకలు జరిగాయని, తీర్పు వెలువడించిందన్నారు. గ్రూప్ -1 పరీక్షలు పూర్తిగా రద్దు చేసి తిరిగి మళ్లీ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. టీజీపీఎస్సీ చైర్మన్, సభ్యులు నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలన్నారు. కాగజ్‌నగర్ మండల కన్వీనర్ అంజన్న, మాజీ కౌన్సిలర్ మిన్హాజ్, నాయకులు కాశిపాక రాజు, బాబర్, అమర్, వెంకటేశ్, రాజన్న, శివ, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుట్టుగా గ్లైఫోసెట్ దందా!

- వర్షాలకు పత్తిలో పెరిగిన కలుపు
- కూలీల కొరతతో గడ్డిమందు వినియోగం
- పట్టించుకోని అధికారులు


ఇటీవల వాంకిడిలో పోలీసులు పట్టుకున్న నిషేధిత గడ్డిమందు

కౌటాల: జిల్లాలో పత్తి సాగు అధికంగా ఉంది. కూలీల కొరతతో కలుపు నివారణకు రైతులు నిషేధిత గ్లైఫోసెట్ గడ్డిమందు వినియోగిస్తున్నారు. రాష్ట్రంలో గ్లైఫోసెట్ గడ్డి మందుపై నిషేధం ఉండగా.. సమీప సరిహద్దు మహారాష్ట్రలో నియంత్రణ మాత్రమే ఉంది. అక్కడ నుంచి లీటర్ రూ.500లకు తీసుకొచ్చి ఇక్కడ రైతులకు రూ.1500లకు విక్రయిస్తున్నారు. రైతులు స్థానికంగా కొనుగోలు చేసిన గడ్డి మందులో నిషేధిత గడ్డిమందును కలిపి పిచికారీ చేస్తున్నారు.

నిఘా కరువు..

జిల్లాలో 3.50 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి పంటలో కలుపు పెరిగింది. అయితే కూలీల కొరత రైతులను వేధిస్తోంది. కూలీల కొరతతో పాటు కూలి రేట్లు కూడా అధికం కావడంతో ప్రత్యామ్నాయంగా రసాయన మందులపై దృష్టి సారిస్తున్నారు. దీనిని దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాకు సరిహద్దులోని వాంకిడి, చింతలమానెపల్లి, కౌటాల, సిర్పూర్(టి), బెజ్జూర్ మండలాల నుంచి అక్రమంగా నిషేధిత గడ్డి మందు రవాణా చేస్తున్నారు. ప్రమాదకరమైన గ్లైఫోసెట్ మందును ప్రైవేట్ వ్యాపారులు రైతులకు అంటగడుతున్నారు. పలువురు రైతులు గ్లైఫోసెట్ మందును కొనుగోలు చేసి కలుపు నివారణకు వాడుతున్నారు. పలు మందుల కంపెనీలు వ్యాపారులను విదేశీ విహారయాత్రలకు తీసుకెళ్తామని ఆఫర్లు ప్రకటించడంతో.. వ్యాపారులు ఆయా కంపెనీల మందులే విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

భూసారానికి ముప్పు..

పత్తి చేనులో కలుపుతీతకు రైతులు గ్లైఫోసెట్ వినియోగిస్తున్నారు. దీంతో పర్యావరణానికి హానితో పాటు భూసారం దెబ్బతింటుంది. జిల్లాలోని చాలా మంది రైతులు గతంలో నిషేధిత (బీజీ-3) పత్తి విత్తనాలను సాగు చేసేవారు. గ్లైసిల్ పత్తి విత్తనం సాగు చేసిన పంటలో ఈ మందు పిచికారి చేస్తే గడ్డి మాత్రమే ఎండిపోతుంది తప్పా పత్తి మొక్కలకు ఎలాంటి హానీ జరగదు. అధికారులు దాడులు నిర్వహించి గ్లైసిల్ పత్తి విత్తనాలు పట్టుకుంటున్నారు. ఈనేపథ్యంలో గుట్టు చప్పుడు కాకుండా కొందరు రైతులు గ్లైసిల్ పత్తిని సాగు చేస్తున్నారు. పత్తి పంటలో కలుపు నివారణకు గ్లైఫోసెట్ గడ్డి మందును వినియోగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్ల క్రితం గ్లైఫోసెట్ గడ్డి మందును నిషేధించింది. పోలీస్, వ్యవసాయ శాఖ వ్యాపారుల దందాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు పేర్కొంటున్నారు.

భూసారం తగ్గుతుంది..



గ్లైఫోసెట్ దుష్పరిణామాలపై గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ గడ్డిమందుతో నేల సారం తగ్గి పంటల దిగుబడి తగ్గుతుంది. రైతులకు సైతం అనారోగ్య సమస్యలు వస్తాయి. అక్రమంగా గ్లైఫోసెట్ వినియోగించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటాం.

– ప్రేమలత, ఏవో

ఇటీవల చోటు చేసుకున్న సంఘటనలు

- జూలై 8న చింతలమానెపల్లి మండలం గూడెం వద్ద మహారాష్ట్ర నుంచి అక్రమంగా గ్లైఫోసెట్ మందు తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రూ. 40 వేల విలువ గల నిషేధిత గడ్డి మందు పట్టుకున్నారు.
- వాంకిడి మండల కేంద్రంలో జూలై 8న మహారాష్ట్ర నుంచి గడ్డి మందు తరలిస్తున్న ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేసి 40 లీటర్ల గడ్డిమందు స్వాధీనం చేసుకున్నారు.
- ఇద్దరు మహారాష్ట్ర నుంచి అక్రమంగా కారులో తరలిస్తున్న నిషేధిత గడ్డి మందును ఆగస్టు 30న పోలీసులు పట్టుకున్నారు. రూ.1,48,390 విలువ గల 363 లీటర్ల గడ్డి మందును పట్టుకున్నారు.

పంటలకు ప్రాణం

- విస్తారంగా కురుస్తున్న వర్షాలు
- రైతుల్లో ఆనందం
- సాగు పనుల్లో నిమగ్నం


కెరమెరిలో పత్తి పంట

కెరమెరి: మండలంలో గత నెల రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలు పంటలకు ప్రాణం పోస్తున్నాయి. దీంతో రైతులు సాగు పనులు చేపట్టి నిమగ్నమయ్యారు. గతంలో ఎన్నడు లేని విధంగా సెప్టెంబర్‌లో వానలు కురవడంతో వారిలో ఆనందం వ్యక్తమవుతోంది. మండలంలో 31 పంచాయతీల్లో 156 గ్రామాలు ఉన్నాయి. మొత్తం 8,243 మంది రైతులు ఉండగా, 32,000 ఎకరాల్లో వివిధ పంటలు పండిస్తున్నారు. గతేడాది 24 వేల ఎకరాల్లో పత్తి వేయగా, ఈ ఏడాది మరో వెయ్యి ఎకరాలను అధికంగా పండిస్తున్నారు. పత్తికి అనుకున్న ధర లేకున్నప్పటికి వాణిజ్య పంట కావడంతో సాగు చేస్తున్నారు. ఆహార పంటలు వేయాలని వ్యవసాయాధికారులు చెబుతున్నా పత్తి వైపే మొగ్గు చూపుతున్నారు.

నల్ల రేగడికి కొంత ఇబ్బందే

మండలంలోని నల్లరేగడి భూములు ఉన్న కొంత ఇబ్బంది కలుగుతుంది. బండరాళ్లు, ఇసుకతో కూడిన వ్యవసాయ భూములకు ఎలాంటి ఢోకా లేదు. కొన్నిచోట్ల పూత రాలుతుండగా, అతి తక్కువ ప్రాంతాల్లో ఆకులు నల్లబడుతున్నాయి. సెప్టెంబర్‌లో వానలు పడుతూ..వాతావరణం చల్లగా ఉండడంతో రైతులు పొలం పనుల్లో నిమగ్నమవుతున్నారు.

మండలంలో సాగు వివరాలు..

పంటలు	ఎకరాలు
పత్తి	25,000
కంది	5,400
పెసర	600
సోయా	150
మినుములు	150
జొన్న	200
కూరగాయలు	500

ఇంటిబాట పడుతున్నాం



నెలరోజులు కురిసిన వర్షం మెరుగ్గా ఉంది. పక్షం రోజులు కురుస్తున్న వానలు గెరివిస్తే పొలం పనులు చేసేందుకు వీలు ఉంటుంది. వానలకు రైతులు, కూలీల మధ్యలో ఇంటిబాట పడుతున్నారు. కూలీలకు పని చేయకున్నా డబ్బులు ఇవ్వాల్సి వస్తుంది.

– ఆత్రం బొజ్జిరావు, రైతు, చౌపన్‌గూడ

చార్జిషీట్ లెటర్లు రద్దు చేయాలి


వినతిపత్రం ఇస్తున్న హెచ్ఎంఎస్ నాయకులు

రెబ్బెన: ఖైరిగూర ఓసీపీలో తమ సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలిపిన ఈపీ ఆపరేటర్లకు యాజమాన్యం ఇచ్చిన చార్జిషీట్ లెటర్లను వెంటనే రద్దు చేయాలని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు పేర్కొన్నారు. ఈమేరకు గురువారం ఖైరిగూర మేనేజర్ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యంతో కలిసి శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన ఈపీ ఆపరేటర్లకు లెటర్లు ఇప్పిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. గుర్తింపు సంఘం నాయకులు ఏ గ్రేడ్ వెహికల్ నడుపుతున్న ఈపీ ఆపరేటర్లందరికి ఏ గ్రేడ్ ప్రమోషన్లు ఇప్పిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. యాజమాన్యం వారికి రావాల్సిన ఏ గ్రేడ్, బీ గ్రేడ్, సీ గ్రేడ్ ప్రమోషన్లు బ్యాక్‌డేట్‌తో ఇచ్చి ఏరియర్స్ చెల్లించాలన్నారు. కార్మికులు డ్యూటీకి వచ్చేందుకు సరైన రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఎండీ ఓజియార్, ఏరియా ఆర్గనైజర్ ఎస్కే ఇనూస్, ఖైరగూర ఇన్‌చార్జి వెంకటేశ్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ కుమార్‌గౌడ్, సుధాకర్ పాల్గొన్నారు.

మిమిక్రీ కళాకారుడికి సన్మానం


మహేశ్‌పటేల్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్అర్బన్: జిల్లాకు చెందిన మిమిక్రీ కళాకారుడు రేగుల మహేశ్‌పటేల్‌ను గురువారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మున్నూరుకాపు సంఘం నాయకులు శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు పోలంపల్లి గణపతి మాట్లాడుతూ ఇటీవల అమెరికాలో జరిగిన ప్రపంచ మున్నూరుకాపు సమ్మేళనంలో మహేశ్ పటేల్ చేసిన మిమిక్రీతో అందరిని మెప్పించారని తెలిపారు. జబర్దస్త్ షోలో వెంకీ టీంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సర్వకల నంది అవార్డును అందుకోవడం అభినందనీయమన్నారు. నాయకులు గుర్రాల వెంకటేశ్వర్లు, సుంకరి పెంటయయ్య, అడప సతీశ్, సురేశ్, తిరుపతి, సదాశివ్, వెంకటేశ్, రాజేష్ పాల్గొన్నారు.

'డబుల్ రోడ్డు నిర్మించాలి'


మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: కౌటాల -చింతలమానెపల్లి రోడ్డును డబుల్ రోడ్డుగా నిర్మించాలని బీజేపీ జిల్లా నాయకుడు ఎల్ములే మల్లయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం గతంలో ప్రతీ మండల కేంద్రం నుంచి మరో మండల కేంద్రం వరకు డబుల్‌రోడ్డు వేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. నూతన మండలంగా ఏర్పాటు చేసిన చింతలమానెపల్లి వరకు కౌటాల నుంచి డబుల్ రోడ్డు నిర్మించాలన్నారు. సింగిల్ రోడ్డు కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీ దుర్గం మోతీరాం, నాయకులు సత్తయ్య, భూమయ్య, అశోక్, రవి, తిరుపతిరావు, గోపాల్, హర్షిత్, శంకర్, కాశీనాథ్ పాల్గొన్నారు.

పౌరహక్కుల దినోత్సవం నిర్వహించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా వ్యాప్తంగా పౌరహక్కుల దినోత్సవాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కేవీపీఎస్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి దినకర్ మాట్లాడుతూ జిల్లాలో నామమాత్రంగా పౌర హక్కుల దినోత్సవాన్ని జరిపి చేతులు దులుపుకొంటున్నారని ఆరోపించారు. నాయకులు మల్లేష్, నగేష్‌లు ఉన్నారు.

ఎస్టీ సర్టిఫికెట్లు నిలుపుదల చేయాలి


వినతిపత్రం ఇస్తున్న తుడుందెబ్బ నాయకులు

కెరమెరి(ఆసిఫాబాద్): ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన లంబాడాలను ఎస్టీ సర్టిఫికెట్లు నిలుపుదల చేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఇన్‌చార్జి తహసీల్దార్ సంతోషకుమార్‌కు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వలస లంబాడాలకు ఇప్పటి వరకు ఇచ్చిన సర్టిఫికెట్లను రద్దు చేయాలన్నారు. వీరికి ఎస్టీ సర్టిపికెట్లు ఇచ్చి నిజమైన ఆదివాసీలకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. కుడ్మెత సోము, పెందోర్ మోతీరాం, ఆతర భీంరావు, కినక సకారాం, మెస్రం వాగు, ఆత్రం రాజు ఉన్నారు.

ఖమానలో వైద్యశిబిరం


మందులు అందజేస్తున్న ఏఎన్ఎం

వాంకిడి: మండలంలోని ఖమాన గ్రామంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి పోషం, ఏఎన్ఎం పుష్పలత, ఎఫ్ఏ దేవిదాస్ పాల్గొన్నారు.

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిని కలిసిన ఎఫ్‌డీవో


మొక్క అందజేస్తున్న ఎఫ్‌డీవో దేవుదాస్ సింగ్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కోర్టు సముదాయంలో ప్రిన్సిపల్ జూనియర్‌సివిల్ జడ్జి అనంతలక్ష్మిని ఎఫ్‌డీవో దేవుదాస్ సింగ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట ఎఫ్ఆర్వో గోవింద్ సింగ్ సర్దార్, డిప్యూటీ ఎఫ్ఆర్వో సరోజరాణి ఉన్నారు.





వాంకిడి: మండల కేంద్రం నుంచి ఖమాన గ్రామానికి వెళ్లే రహదారిలో ప్రాజెక్టు కాలువ వద్ద చెత్త, ఆహార వ్యర్థాలు పడేస్తున్నారు. కొన్ని నెలలుగా మండల కేంద్రానికి చెందిన కొందరు చెత్తతో పాటు ఆహార వ్యర్థాలను ఇక్కడ పడేస్తుండటంతో దుర్గంధం వెదజల్లుతుంది. ఆహార వ్యర్థాలు పడేస్తుండటంతో కుక్కలు ఈ ప్రాంతంలో తిరుగుతూ ఒంటరిగా వెళ్లే పాదాచారులపై దాడులు చేస్తున్నాయి. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని, చెత్త పడేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

టెట్‌పై తీర్పును సమీక్షించాలి


మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

కౌటాల(సిర్పూర్): ఉపాధ్యాయులు టెట్ అర్హత సాధించాలనే సుప్రీం కోర్టు తీర్పును సమీక్షించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వి.శాంతికుమారి కోరారు. కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయుల సంఘం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల పైబడి సర్వీసున్న ఇన్ సర్వీస్ టీచర్లందరూ రెండేళ్లలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఉత్తీర్ణులు కావాలని, లేదంటే ఉద్యోగాన్ని వదులుకోవాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. 2010 తర్వాత ఉద్యోగాలు పొందిన టీచర్లకు మాత్రమే టెట్ నిర్వహించాలని, అంతకు ముందు వారికి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గుణాకర్, సంపత్, దేవరావు, రాహుల్, ప్రకాశ్, ఇందిరా, సరిత, మనీషా తదితరులు పాల్గొన్నారు.

రేపు 'ముందస్తు దసరా'పై సమావేశం

కెరమెరి: మండలంలోని జంగుబాయి దేవస్థానంలో ముందస్తు దసరా ఉత్సవం నిర్వహించేందుకు ఈనెల 13న నార్నూర్ మండలం గుండాల గ్రామంలో ఉదయం 10 గంటలకు సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు జంగుబాయి ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు మరప బాజీరావ్ ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి 8 గోత్రాలు కటోడాలు, ఆదివాసీలు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని కాపువాడలో ఎమ్మాజీ వీధిలో గల విద్యుత్ స్తంభం వివిధ తీగల బరువుతో ఒకవైపు ఒరిగింది. బలమైన గాలులు వీచినప్పుడు స్తంభం ఊగుతుందని, స్తంభానికి సపోర్టు ఏమి లేకపోవడంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొందని, పాతకాలం స్తంభాలను మార్చి కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి వంగిపోయిన విద్యుత్ స్తంభం స్థానంలో కొత్త స్తంభం ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వీవోఏల నూతన కార్యవర్గం


శ్రీధర్


సుజాత

కెరమెరి: మండల కేంద్రంలో వీవోఏల నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మొహర్లే శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా పార్ది సుజాత, ఉపాధ్యక్షుడిగా అనిషెట్టి రమేశ్, కోశాధికారిగా గుర్నూలె ధర్మారావు, కార్యదర్శిగా బాణోత్ అరుణ్, సలహాదారుగా కోవ ఇందిరా ఎన్నికయ్యారు. వీవోఏల సమస్యలు పరిష్కరించేందుకు ఎల్లవేళలా కృషిచేస్తానని అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.

పిల్లలను పాఠశాలలకు పంపించాలి

కెరమెరి: ప్రతీరోజు పిల్లలను పాఠశాలలకు పంపించాలని ఎంఈవో ఆడే ప్రకాశ్ అన్నారు. మండలంలోని నారాయణగూడ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో మహిళా సంఘాల సభ్యుల ద్వారా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లులతో మాట్లాడారు. బడీడు పిల్లలు పాఠశాలల్లో ఉండాలన్నారు. అనంతరం లేండిగూడ పాఠశాలను సందర్శించారు. అక్కడి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. హెచ్ఎం క్రాంతికుమార్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

బెజ్జూర్: మండల కేంద్రంలోని గోల్కొండకు చెందిన మాజీ ఎంపీటీసీ న్యాయని భాగ్య తండ్రి మండిగా బుందాలు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందించాలని నాయకులను ఆదేశించారు. దీంతో నాయకులు గురువారం రూ.2వేల ఆర్థిక సాయంతో పాటు 25 కేజీల బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు అందించినట్లు తెలిపారు. మాజీ సర్పంచ్ బుజాడి శేఖర్, వార్డు సభ్యులు షౌకత్ అలీ, నాయకులు జావిద్, అమీరొద్దీన్, తంగడపల్లి మహేశ్, పుల్లూరి సతీశ్, షేర్‌ఖాన్, సర్జాద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.